# విన్నపాలు

"ఈవేళ మన పెళ్ళిరోజు" మృదువుగా అంది సుజాత. తరువాత ఆమె కంఠం పూడుకుపోయినట్లయిపోయింది.

"అయితే?" రమణమూర్తి గొంతుచాలా అసహనంగా వుంది.

"అంతేనా? అంతకంటె ఏమీ అనిపించటం లేదా మీకు?" మరింత మృదువుగా మాట్లాడే ప్రయత్నం చేసింది సుజాత. సాధ్యమయినంత సహనం ప్రదర్శించి తన ఆలోచన ఆచరణలో పెట్టే ప్రయత్నంలో వుంది ఆమె.

"ఇలాంటి పెళ్ళి రోజులు పదిహేనో పదహారో వెళ్ళిపోయాయి. అనిపించటానికి ఏముంది ఇందులో? అయినా నువ్వు రచయిత్రివి కనుక నీకేమయినా ప్రత్యేకంగా అనిపించవచ్చు. నాకు మాత్రం ఏమీ అనిపించటంలేదు." అతని మాటల నిండా నిర్లక్ష్యం. ముఖం నిండా చికాకు.

రెండు నిమిషాలసేపు నిశ్శబ్దంగా అతని ముఖం వంకే చూస్తూ వుండిపోయింది ఆమె. అతని కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. కనురెప్పల కింద మృదుత్వం పోయి నల్లని చారలు చోటు చేసుకున్నాయి. సిగరెట్టుతో కమిలిపోయిన అతని పెదాలు మోటుగా నల్లగావున్నాయి. 'ఈ పదహారు సంవత్సరాలలో ఈ మనిషిలో ఎంత తేడా? ఎంత మృదువయిన ముఖం, ఎంత అసహ్యంగా మారిపోయింది? ఎంత అందమయిన మనసు ఎంత అన్యాయంగా పతనమయిపోయింది?' సుజాత మనసు కలచివేసినట్లయింది.

"ఏం? నా ముఖంలో కోతులాడుతున్నాయా? లేక నీ కవితా హృదయంతో కొత్త అందాలు వెదుకుతున్నావా"

రమణమూర్తి హేళనగా అడిగేడు. సుజాత అతనికి మరింత చేరువగా వెళ్ళింది.

"మీ ముఖంలో అందానికి ఏం తక్కువయిందని?కాకపోతే పరిస్థితులు ఇలా వచ్చేయి కానీ, మీ ముఖంలో రోజుకొక కొత్త అందం వెతుక్కుంటూ మీ వక్షం మీద తలపెట్టుకుని నిశ్చింతగా కాలంగడిపిన రోజులు నేనెలా మరిచిపోతాను?" రమణమూర్తి ఆమె మాటలకు సమాధానం చెప్పకుండా కొంతసేపు మౌనంగా వుండిపోయి ఆ తర్వాత అడిగేడు. "ఇంతకీ సంగతేమిటో చెప్పరాదూ? నేను బయటకు వెళ్ళాలి"

"ఈవేళ నాతోటీ,పిల్లలతోటి కనీసం అరగంట సేపయినా గడుపుతానని మాట ఇచ్చేరు. మరిచిపోయారా?"

"మరిచిపోలేదు"

"మరి, బట్టలు వేసుకుని తయారయిపోయి బయటకు వెళ్ళిపోతున్నారేం?"

"ఏం శాసిస్తున్నావా?"

"శాసించే తెలివితేటలు నాకు భగవంతుడు ఇచ్చి వుంటే, మిమ్మల్ని ఇంతకంటె

పదిలంగా చూసుకునేదాన్ని. మీరు ఇలా ఎందుకయిపోతారు?"

"ఇప్పుడు నేనేమీ అయిపోలేదు. అనవసరంగా బెంగపెట్టుకోకు. రాత్రి తిరిగివచ్చేక మాట్లాడుకుందాంలే. అప్పుడు కావాలంటే నీతోటీ, పిల్లలతోటీ గంటసేపు కబుర్లు చెబుతాను" అన్నాడు పొడిగా. సుజాత నిర్లిప్తంగా నవ్వింది.

"రాత్రి తిరిగి ఇంటికి వచ్చే సమయానికి మీరు ఇలా మాట్లాడగలిగే స్థితిలో వుంటారని మీకు నమ్మకం వుంటే వెళ్లిరండి. ఎంతరాత్రయినాసరే మీరు వచ్చే వరకూ నేనూ, పిల్లలూ ఎదురు చూస్తూవుంటాం. అందరం కలిసి భోజనాలు చేసి కబుర్లు చెప్పుకుందాం" అంది. రమణమూర్తి ఏం బదులు చెప్పాలో తోచక తడబడ్డాడు.

సుజాత మాట అంటే అన్నంతపనీ చేస్తుంది. తాను తిరిగి వచ్చే సమయానికి ఎలావుంటాడో తనకు తెలుసు. ఒక అరగంటసేపు ఇపుడు ఇంట్లో కూర్చుని తర్వాత బయటకు వెళ్ళటమే మంచిదనిపించింది అతనికి. మారు మాట్లాడకుండా షర్టు విప్పి హేంగరుకు తగిలించి కుర్చీలో కూలబడ్డాడు. మరోకుర్చీ అతడికి దగ్గరగా లాగి అందులో కూలబడింది సుజాత.

"నేను చెప్పేది కాస్త ఓపిగ్గా వినండి. ఈ పెళ్ళిరోజున మీరు నాకు ఇచ్చే కానుక అదే."

"చెప్పు"

"ఈవేళ్టికి మనపెళ్ళి జరిగి పదహారు సంవత్సరాలు నిండేయి. పదిహేడో ఏట అడుగుపెడుతున్నాం" అంటూ మాటలు ఆపి గొంతు సవరించుకుంది సుజాత.

"పిల్లలేరీ?" తాపీగా అడిగేడు రమణమూర్తి.

"పై వరండాలో ఆడుకుంటున్నారు. తరువాత పిలుస్తానులెండి. ముందు నన్ను మాట్లాడనివ్వండి. పెళ్ళయిన తర్వాత పది సంవత్సరాలు ఏ బాధాలేకుండా గడిపేం మనం. ముచ్చటగా ఇద్దరు పిల్లలుపుట్టేరు మనకి. రోగాలు రొచ్చులు లేకుండా పెరుగుతున్నారు వాళ్ళు. మొదట పది సంవత్సరాలలోనూ మీ జీతంలో మిగుల్చుకున్న డబ్బుతో ఇంట్లో ఫ్రిజ్, మంచి ఫర్నిచరు అమర్చుకున్నాం. నాకు సంగీతమంటే ఇష్టమని మంచి 'స్టీరియోడెక్' కొనిపెట్టేరు. సాహిత్యంలో నాకు అభిలాషవుందని మంచి పుస్తకాలుబోలెడు కొన్నారు. అవన్నీ మీ ఆర్జన లోనివే. నాకు బోలెడు నగలు, చీరలు కొన్నారు. మీరు వేసుకునే బట్టలుకూడా రవంత నలిగితే మార్చిపారేసేవారు. సెంటు పరిమళం తప్ప మరొక వాసన మీ దగ్గర సోకేదికాదు. ఇవన్నీ ఆరేళ్ళ క్రితం నాటి వరకూ ముచ్చట్లు. అప్పట్లో మనింట్లో భూతం ప్రవేశించింది.

మొదటి రోజుల్లో త్రాగి, నాకు తెలిస్తే బాధపడతానని ఫ్రెండురూంలో వుండి పోయేవారు. తరువాత రోజుల్లో ఇంటికి వచ్చినా, మరునాడంతా నాతో మాట్లాడటానికి సిగ్గుపడేవారు. ఆ తర్వాత పార్టీలో తాగక తప్పిందికాదని సాకులు చెప్పి తప్పించుకునేవారు.

తాగటం తప్పుకాదనీ, అదొక స్టేటస్‌సింబల్ అనీ నాచేత ఒప్పించే ప్రయత్నంలో తర్వాత చాలా రోజులు గడిచేయి. హద్దులో తాగితే ఇబ్బంది లేదనీ, బీరులోని ఆల్కహాలు, ఆరుశాతం మాత్రమేననీ నాకు విడమరిచి చెప్పటంతో చాలా వారాలు గడిచిపోయాయి. బ్రాందీలో ఆకలి కల్గించే గుణం వుందనీ, తగుమోతాదులో సేవిస్తే మంచిదనీ డాక్టర్లు సలహాలు ఇస్తున్నారనీ, విదేశీ పత్రికలలోని 'కొటేషన్లు' వెదికి నాకు చూపించటంలో మరిన్ని నెలలే గడిచిపోయాయి.

అర్ధరాత్రి సమయంలో వీధి తలుపు దబదబా బాది వీధిలోనే కూలబడి పోతే

మెల్లగా తలుపుతీసి పిల్లల కంటపడకుండా గోల చేయవద్దని మిమ్మల్ని బతిమాలుకుంటూ గదిలోకి తీసుకువచ్చి, మంచం మీద పడుకోబెట్టటంలో, మరిన్ని సంవత్సరాలే గడిచిపోయాయి. మీలో ఈ ఆరు సంవత్సరాల కాలంలో ఎంత క్రూరమయిన మార్పు వచ్చిందో గమనించగలిగేరా? మీ చుట్టూ అల్లుకుని వున్న మా జీవితాలలో కూడా ఎన్నెన్ని మార్పులు వచ్చేయో కనీసం మీరు ఊహించగలుగుతున్నారా?"

ఊపిరి పీల్చుకోటానికి మాటలు ఆపింది సుజాత. ఈ ఊపు వదిలేస్తే తాను చెప్పాలనుకున్న రీతిలో మళ్ళీ చెప్పలేదు. మరింత మనోధైర్యం సమకూర్చుకుని, మరింత మృదుత్వం గొంతులో పోసుకుని, మళ్ళీ చెప్పటం ఆరంభించింది.

"మనకు ఆప్తులనుకున్న వాళ్ళందరూ ఒక్కరొక్కరే మనకు దూరమయిపోతున్నారు. బంధువుల ఇంటికి మనం వెళ్ళటం తగ్గిపోయింది. రాత్రిపూట బంధువులు వస్తే మీరు వాళ్ళతో కలిసి భోజనం చెయ్యరు. ఎందుకని? తాగకుండా తినటం కుదరదు కాబట్టి. సాయంకాలం పూట మనం పిల్లలతో కలిసి వెళ్ళే షికారు మాయమయింది.

మిత్రుల ఇళ్ళకు వెళ్ళి గంటల తరబడి హాయిగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చొని రాత్రి ఏ పదకొండు గంటలకో వెన్నెల్లో తడుస్తూ, జోకులు వేసుకుంటూ నడిచి వచ్చి ఇల్లుచేరి ఆ సమయంలో నేను వంట చేస్తూ వుంటే మీరు నాకు అవీ ఇవీ అందించి సహాయం చేసేవారు. ఎంత హాయిగా వుండేవి ఆ రాత్రులు? ఆ రాత్రులన్నీ ఏమయిపోయాయి? మనచుట్టూ వుండే పదిమందికి మనం సలహాలు చెప్పేవాళ్ళం

ఇపుడో! అందరూ మనకే సలహాలు చెబుతున్నారు.

'మీ ఆయన మరీ మితిమీరి పోతున్నాడు నువ్వు కాస్త చెప్పారాదూ?' అని ఒకరంటే 'నువ్వు బొత్తిగా పట్టించుకోకపోవటం ఏమీ బాగాలేదమ్మాయ్' అని మరొకరు, ఇలా ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు అంటూవుంటే గుండెల్లో గునపాలు దింపుతున్నట్లుంటోంది నాకు.

మీరు వెళ్తూవుంటే మీ వెనుక వెక్కిరింతలు, గుసగుసలు, హేళనలు, నవ్వులు, అవి నా కంటపడితే, నా చెవులకి వినబడితే, ఎలా వుంటుందో ఎన్నడయినా ఆలోచించ గలిగేరా? మొన్నటికి మొన్న... 'న్యూ ఇయర్‌పార్టీ' రోజున ఏమయిందో గుర్తుందామీకు?

మందు ఎక్కువయి పోయింది మీకు. క్లబ్బు వరండాలో ప్రభావతిగారి చెయ్యిపట్టుకున్నారు మీరు. ఆవిడ మహా ఇల్లాలు కనుక అల్లరి చెయ్యకుండా వెళ్ళిపోయి మరునాడు నాతో చెప్పింది.

మరోరోజున మీరు తప్పతాగి వచ్చి, తలుపుకూడా తట్టటం మరిచిపోయి గేటు దగ్గర పడి నిద్రపోతూ వుంటే మనపక్కింటి రామయ్యగారు వచ్చి తలుపుతట్టి మిమ్మల్ని లోనికి సాయంపట్టి తీసుకువచ్చాననాడు 'నేనింకా ఎందుకు బతికివున్నానురా భగవంతుడా?' అనిపించింది.

నాలుగు రోజులు మనింట్లో సరదాగా గడిపివెళ్ళటానికి మా అక్కయ్య వస్తే మీరేం చేశారు? నేను బాత్‌రూంలో వుండగా అది వీధి తలుపులు తెరిస్తే మైకంలో దాన్ని వాటేసుకున్నారు. 'నీమొగుడేమిటే బొత్తిగా ఇలా తయారయ్యేడు?' అని మరునాడు ఈ విషయం చెప్పిందినాకు. నా ముఖం ఆ సమయంలో ఎలా అయిపోయివుంటుందో కనీసం మీరు ఊహించగలరా? ఈ వేళ మీ జీతం నెలకు మూడువేలపైచిలుకు అయితే ఏం లాభం? అందులో సగం మీ తాగుడుకే అయిపోతోంది. పైగా ఇంతకు ముందు శ్రమపడి కొనుక్కున్న వస్తువులన్నీ ఒక్కొక్కటే కాళ్ళొచ్చి వెళ్ళిపోతున్నాయి. అద్దె ఇంట్లో గోడకు అల్మారాలు వున్నాయనే సాకుతో మంచి గాడ్రెజ్ బీరువా అమ్మేశారు. సెట్ పాతదయి పోయిందనే నాకుతో స్టీరియో అమ్మేసారు.

వ్యవసాయం చేయటం మనకు చేతకాదనీ,రైతు శిస్తును సరిగా ఇవ్వటంలేదనీ ఏవేవో కారణాలు చూపి మీ నాన్నగారు ఇచ్చిపోయిన రెండు ఎకరాలు భూమి అమ్మిపారేశారు. ఆ డబ్బు పన్నెండు వేలూ మీ చేత 'ఫిక్స్‌డ్ డిపాజిట్' లో వేయించేను. కానీ ఏమిటి లాభం? ఆఫీసులో స్నేహితునికి పీకలమీదకు వచ్చిందనీ, సహాయం చేయాలని చెప్పి దాని మీద బోలెడంత 'లోను' తీశారు. ఆ స్నేహితుడెవరో ఈనాటికీ నాకు తెలీదు. పిల్లలకు బట్టలుకుట్టించాలంటే 'మళ్ళీ నెల చూద్దాంలే' అని దాటవేస్తున్నారు. పండగకు మంచి చీర కొనమంటే 'నీకు మంచి చీరలతో పనేమిటి? నువ్వే అందంగా వుంటావ్' అని బుజ్జగించేస్తున్నారు నన్ను.

మీ ఆఫీసు బట్టలన్నీ పాడయిపోయాయి. వారమంతా ఒకటే జతతో గడిపేస్తున్నారు మీరు. సెంటు వాసనతప్ప వేరే వాసన తెలియని మీ దగ్గర బ్రాందీ వాసన తప్ప మరేమీ రావటంలేదు. మీలో నిగ్రహశక్తి ఏమయిపోయింది? మీకో సంగతి గుర్తుందా? పెళ్ళినాటికి మీకుసిగరెట్లు కాల్చే అలవాటుండేది. అయితే నాకా వాసన పడటం లేదని మీతో ఒక రోజున అన్నాను. అంతే! కాలుస్తున్న సిగరెట్టును అవతలకు గిరాటేశారు. నాకు 'సారీ' చెప్పి ఆ అలవాటుమానేశారు. తర్వాత పది సంవత్సరాలు మీరు సిగరెట్టు ముట్టలేదు. ఇదిగో ఈ మహమ్మారితో బాటు మళ్ళీ సిగరెట్టు ఆరంభించేరు. ఆవేళ్టి నిగ్రహశక్తి మీలో ఈ వేళ ఏమయింది? నేను ఇంతకాలం మీతో ఈ విషయం

గురించి అంత సీరియస్‌గా చర్చించలేదు.

మీ తెలివితేటలమీద నాకు నమ్మకం ఉంది. మీ మంచితనం మీద నాకు విశ్వాసం ఉంది. అందుకే ఆ అవసరం లేదనుకున్నాను. కానీ నా విశ్వాసాలు, నమ్మకాలు నా మనిషిని బలి తీసుకుంటాయని ఇపుడు భయంవేస్తోంది నాకు.

మీరు ఏ విధంగా అందరికీ దూరమయిపోతున్నారో, ఏ విధంగా అందరికీ చులకన అయిపోతున్నారో ఒక్కసారి ఆలోచించండి.

మీలో వచ్చినమార్పు...

ఈ తాగుడు భూతం తెచ్చిన మార్పు ఎంత భయంకరమయినదో అర్థమవుతుంది. ఇంతసేపు నా మాటలను ఎంతో ఓపికగా విన్నారు. అదే నాకు కొండంత బలాన్ని ప్రసాదించింది". సుజాత మాటలు ఆపింది.

తర్వాత "సీనూ! ఉషా! ఇలారండి" అంటూ కేకపెట్టింది. వీధివరండాలో నుండి పిల్లలిద్దరూ వచ్చి బెదురుగా అక్కడ నిలబడ్డారు.

"మీ నాన్నగారితో ఏదో మాట్లాడాలన్నారు కదా మాట్లాడండి మరి" అంటూ పిల్లలవంక చూసింది. పదేళ్ళ సీను తండ్రి వంకచూస్తూ "నాన్నా! మమ్మల్ని 'జూ'కి తీసుకువెళ్తానని ఎన్నోసార్లు చెప్పేవు కానీ తీసుకువెళ్ళలేదు మొన్నరాత్రి మా స్కూలు ఫంక్షనుకి అందరు నాన్నలూ వచ్చేరు. కానీ నువ్వురాలేదు. రాత్రిపూట మాతో భోజనం చేయమంటే చేయవు. పగలేమో ఆఫీసులో తింటావు మాస్నేహితులందరి నాన్నలూ రాత్రిపూట ఎంచక్కా వాళ్ళతో కలిసి తింటారు. నువ్వు కూడా మాతో కలిసి తింటే మాకు బాగుంటుందినాన్నా" పాఠం వల్లించినట్లు చెప్పి బెదురుగా బయటకు వెళ్ళిపోయాడు సీను.

"ఉషా నువ్వేం చెప్తావో చెప్పు"

ఆరేళ్ళ కూతురి వంక చూస్తూ అడిగింది సుజాత.

"మరేమో నువ్వు తాగుతావుట కదా! నువ్వుసారా తాగుతావని... మా స్నేహితురాళ్ళందరూ నన్ను'తాగుబోతు కూతురు' అంటూ ఏడిపిస్తున్నారు. నువ్వు తాగటం మానెయ్ నాన్నా!..." అంది బిక్కమొఖం పెట్టి. తరువాత తన పాత్ర ముగిసినట్లు మెల్లగా నడుచుకుంటూ బయటకు వెళ్ళిపోయింది. సుజాత రమణమూర్తి వంక చూసింది!

అతని చెంపల మీదుగా కన్నీళ్ళు జారిపోతున్నాయి. ★

(యువ మంత్లీ దీపావళి సంచిక 1983)